ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
గురువారం 17 అక్టోబరు 2024

అక్రమార్కులను వదిలి పెట్టం

- మునిసిపల్ కమిషనర్ నరేష్‌కుమార్

ఇంటర్వ్యూ..



నాగర్‌కర్నూల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని కమిషనర్ బోగాది నరేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఐదు సంవత్సరాల నుంచి మునిసిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల అవకతవకలకు సంబంధించిన ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు సమర్పించామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో అవకతవకలపై వస్తున్న విమర్శలకు మీ సమాధానం?

మునిసిపల్ కమిషనర్‌గా నేను బాధ్యతలు స్వీకరించి స్వల్ప కాలం అయ్యింది. అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు నా దృష్టికి వచ్చింది.

ఎన్ని నిధులు దుర్వినియోగం అయ్యాయి?

దాదాపు కోటి రూపాయల వరకు దుర్వినియోగం అయినట్లు తేలింది. ఇందుకు సంబంధించి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఖాతాను చెక్ చేస్తున్నాం.

ఈ కుంభకోణం వెనుక ఎవరు ఉన్నారు?

మెప్మా విభాగంలో అకౌంట్ సెక్షన్ బిల్లింగ్ ప్రక్రియను చూసే తాత్కాలిక ఉద్యోగిని గుర్తించాం. విధులకు గైర్హాజరు అయ్యే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి దినసరి వేతనం అతని అకౌంట్‌కు మళ్లించినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించాయి. ఇందుకు సంబంధించి నివేదికను కలెక్టర్‌కు పంపించాం.

వాహనాల మరమ్మతు, డీజిల్‌కు సంబంధించి కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి?

నేను నాగర్‌కర్నూల్ కమిషనర్‌గా చేరకముందు ఏం జరిగిందో తెలియదు. నేను బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతీ వాహనానికి జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాం. వాహనాల మరమ్మతుకు సంబంధించి కూడా గతంలో ఉన్న బాక్స్ టెండర్ల విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్ష
- మునిసిపాలిటీలలో 100 శాతం పన్ను సేకరించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)దరఖాస్తులను పరిష్కరించే సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మునిసిపల్, రెవెన్యూనీటి పారుదలశాఖ అధికారులతో ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుల పరిష్కారంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మునిసిపాలిటీల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన సమయంలో ప్రభుత్వ భూమి, కోర్టు కేసులు, చెరువులు, కుంటల పరిధిలో ఉన్న భూముల అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. వార్డులలో ప్రతీరోజు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్లు ఉన్నారు.

చేప పిల్లల విడుదలకు సర్వం సిద్ధం

- నేడు నల్ల చెరువులో విడుదల చేయనున్న మంత్రి జూపల్లి



వనపర్తి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చేప పిల్లల విడుదలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గతేడాది ఆగస్టు నెల నుంచే చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేసేవారు. ఈ ఏడాది టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. చేపపిల్లల సంఖ్య కూడా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 50 శాతం తగ్గింది. గతేడాది 2.17 కోట్ల చేప పిల్లల్ని వదలగా.. ఈ ఏడాది కేవలం 1.50 కోట్ల చేప పిల్లల సరఫరాకు మాత్రమే టెండర్లు వేశారు. మూడు నెలలు ఆలస్యం కావడంతోనే చేప పిల్లల సంఖ్యను తగ్గించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొదటిసారిగా నేడు జిల్లా కేంద్రం సమీపంలోని నల్ల చెరువులో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి చేప పిల్లలను విడుదల చేయనున్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 142 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలలో 13,650 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,050 చెరువులతో పాటు నాలుగు రిజర్వాయర్‌లపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో వదిలే చేప పిల్లలు మూడు రకాలుగా ఉన్నాయి. ప్రధానంగా మన దగ్గర బొచ్చ, రౌట, మోసు దీనికి మరొక పేరు మేఘాలయ వంటి చేపలు మాత్రమే వదలనున్నారు.

నేటి నుంచి చేప పిల్లలు విడుదల

జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి చేప పిల్లలు విడుదల చేయనున్నాం. 1,050 చెరువులతో పాటు నాలుగు రిజర్వాయర్‌లలో చేప పిల్లలు వదలనున్నాం. గతేడాది కంటే చేప పిల్లల సంఖ్య కూడా తగ్గింది. ఈ ఏడాది కోటి యాభై లక్షల చేప పిల్లల్ని వదలనున్నాం.

- జిల్లా మత్స్యశాఖాధికారి లక్ష్మప్ప

పైసా వసూల్



- గద్వాల జిల్లాలో ప్రతీ పనికి వాటాలు అడుగుతున్న ఓ నాయకుడు
- పదవులు, బదిలీలు, పోస్టింగుల్లో పెద్ద మొత్తంలో చేతివాటం
- జిల్లా పదవికి రూ.అర కోటి.. స్థానిక పదవికి రూ.10 లక్షల వరకు డిమాండ్
- ఇసుక, కల్లు, మట్టి దందాల్లో కూడా వాటాలు ముట్టజెప్పాల్సిందే..
- పదేళ్ల తర్వాత ప్రభుత్వం వచ్చినా.. ఉసూరుమంటున్న కార్యకర్తలు
- అధిష్ఠానం దృష్టి పెట్టకపోతే కార్యకర్తలకు మరిన్ని ఇబ్బందులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరులో అన్ని జిల్లాల రాజకీయం ఒకెత్తు అయితే.. నడిగడ్డ రాజకీయం మరో ఎత్తు అన్నట్లుగా నాయకుల వైఖరి ఉంటుంది. ఎప్పుడూ విలక్షణ తీర్పును ఇచ్చే ఈ ప్రాంతంలో నాయకుల పెత్తనం ఓ మోస్తరు ఎక్కువనే చెప్పొచ్చు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అయినప్పటికీ.. ఆ పార్టీ రాష్ట్రంలో అధికారానికి పదేళ్ల దూరంగా ఉండాల్సి వచ్చింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుందుభీ మోగించి, అధికారంలోకి వచ్చినా.. కార్యకర్తలకు మాత్రం నేటికీ నైరాశ్యం తప్పడం లేదు. అందుకు కారణం కొందరు పార్టీ ముఖ్య నాయకులని చెప్పొచ్చు. పార్టీలో బలం ఎక్కువగా ఉండటంతో అధికారులను గుప్పిట్లో పెట్టుకున్న సదరు ముఖ్య నాయకులు జిల్లాలో ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. పార్టీ పదవులు మొదలుకుని.. అధికారుల ట్రాన్స్‌ఫర్లు, కొత్తవారికి పోస్టింగుల వరకు ఒక్కో దానికి ఒక్కో ధర నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. ఆ మేరకు ముడుపులు చెల్లించి వస్తున్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, తాన అంటే తందానా అన్నట్లుగా భజన చేస్తున్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా ఎలాంటి పదవులు లేని నాయకుల ఇళ్లకు వెళ్లడం, వారి ఆదేశాల మేరకు పరుగులు తీస్తుండటం చూస్తే ప్రజలు విస్తుపోతున్నారు. ఇటీవల సదరు నాయకుడి ఇంటికి వెళ్లి మరీ భోజన తాంబూలాలు స్వీకరించారు. అసలు ఎలాంటి పదవి లేకుండా ఆయన ఆదేశాలు ఎలా పాటిస్తున్నారో అర్థం కావడం లేదని పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు నివ్వెరపోతున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చాక తమకు పార్టీలో కానీ, ప్రభుత్వంలో కానీ, నామినేటెడ్ కానీ, ఇతర స్థానిక సంస్థల్లో కానీ అవకాశం దక్కుతుందని భావించిన సామన్య కార్యకర్తలు ఉసూరుమంటున్నారు.



అన్నింటికీ కాసులే..

పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఏళ్లుగా పదవులు లేకపోయినా.. పార్టీ కోసం పని చేశారు. అయితే ఇప్పుడు మాత్రం పదవులు రావాలంటే కాసులు కురిపించాల్సిందే. ఇటీవల ఒక జిల్లా స్థాయి పదవికి రూ.అరకోటి నగదు డిమాండ్ చేయగా, రూ.40 లక్షల వరకు ముట్టజెప్పినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. అలాగే జిల్లాలో ఉన్న పలు నామినేటెడ్ పదవులకు కూడా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసు పోస్టింగుల్లో రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఏరియా పోస్టింగును బట్టి ముట్టజెప్పాలని పలువురు బాహాటంగానే చెబుతున్నారు. గత ప్రభుత్వంలో కూడా గద్వాల జిల్లాలో పదవులు, అధికారుల పోస్టింగుల్లో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఖండించిన నాయకులే.. ఇప్పుడు తీసుకోవడం గమనార్హం. ఇవే కాకుండా కల్లు దందాలో నెలవారీ మామూళ్లు రూ.రెండు లక్షల వరకు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తల్లోనే మాజీ నాయకుడి నిర్వాకంతో.. ఇసుక కొరతపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన పత్రికలో కథనం వచ్చింది. తుంగభద్ర నదిలో నీళ్లు నిలిచే వరకు కూడా ఇసుక తరలింపు చేపట్టనివ్వకుండా

మిగతా 6వ పేజీలో...

అర్హులందరికీ పథకాలు అందించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు వర్తింపజేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో పౌర సరఫరాలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని మండల అభివృద్ధి కార్యాలయాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లో ఒక ప్రజాపాలన కేంద్రం పని చేస్తోందని, ఇందుకు సంబంధించిన మార్గనిర్దేశాలను కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులకు తెలియజేశారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, సివిల్ సప్లయ్ అధికారి కాశీవిశ్వనాథ్, డీఎం, డీటీలు పాల్గొన్నారు.

స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌పై యువతకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశానికి హాజరైన కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 16: నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఈ నెల 22న నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన అవగాహన సదస్సుకు ప్రణాళికతో సిద్ధం కావాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డితో కలిసి నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ప్రతినిధులు, ఎస్‌జీవోస్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సు నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు వీలైనంత వరకు నిరుద్యోగులు సదస్సుకు హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్జీవోస్ ప్రతినిధి వెంకట్, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ చాగంటి సురేష్, మేనేజర్ అశ్విన్‌కుమార్, ఎల్‌డీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరు ఉద్యోగాలకు అర్హత

- ప్రతిభ చాటిన గద్వాల యువకుడు



సతీష్‌కుమార్

గద్వాల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు తన ప్రతిభతో ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటనారాయణ, లక్ష్మీ దంపతుల రెండో కుమారుడు సతీష్‌కుమార్ ఇటీవల టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన సివిల్ ఇంజనీరింగ్ పోటీ పరీక్షల్లో 450 మార్కులకు 350 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 382 ర్యాంకు సాధించాడు. ఇటీవలే జీహెచ్ఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా విధుల్లో చేరారు. ఏఈ పోస్టులకు నిర్వహించిన పరీక్షలో 204 ర్యాంకును దక్కించుకున్నాడు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్ పోస్టు కోసం 89వ ర్యాంకు, టీపీబీవోలో రాష్ట్రస్థాయిలో 140 ర్యాంకు, గ్రూప్-4లో రాష్ట్రస్థాయిలో 668, జిల్లా స్థాయిలో 11వ ర్యాంకును దక్కించుకున్నాడు. సెంట్రల్ పబ్లిక్స్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ ఇంజనీర్ పోస్టు కోసం నిర్వహించిన పోటీ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 435 ర్యాంకును దక్కించుకుని తన ప్రతిభను చాటాడు.

దోచేశారు

- బడుల్లో ఉద్యోగాలని రూ.లక్షల్లో వసూళ్లు
- నిరుపేద నిరుద్యోగులే లక్ష్యంగా వల
- వివిధ పోస్టుల పేరుతో అపాయింట్‌మెంట్ లెటర్లు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో బాధితులు



ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో బేరసారాలకు అడ్డాగా చేసుకున్న కళాశాల

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు నగరానికి చెందిన కేర్, కాస్ ఫౌండేషన్ అనే సంస్థ నిరుద్యోగుల కడుపుకొడుతోంది. బడుల్లో ఉద్యోగాలంటూ ఎరవేసి రూ.లక్షల్లో వసూళ్లు చేస్తోంది. కొంత మంది విద్యాశాఖాధికారులను మచ్చిక చేసుకుని, మండలస్థాయి అధికారుల చేతులు తడిపి ఈ తతంగానికి తెరలేపినట్లు తెలుస్తోంది. రాష్ట్ర రాజధానిలోని స్నేహపురి కాలనీ, రోడ్ నెం18, నాగోల్‌లో ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. తమ ఫౌండేషన్ తరపున బడుల్లో వాలంటీరీ ఫ్యాకల్టీగా తదితర సేవలందిస్తామని విద్యాశాఖ అధికారులతో మాట్లాడి హెచ్ఎంలకు చెప్పించారు. ఇందుకు హెచ్ఎంలు కుడా ఒప్పుకున్నారు. ఇక్కడే అసలు తతాంగం మొదలు అవుతుంది. ఫలనా పాఠశాలలో ఫలనా పోస్టు ఖాళీగా ఉందని ఫౌండేషన్ తరపున వకల్తా పుచ్చుకున్న వారితో నిరుద్యోగులకు వల వేయించారు. వారి గ్రామాలకు దగ్గరలో ఉన్న పాఠశాలల పేర్లు చెప్పి అందులోనే ఫలనా పోస్టు ఖాళీ ఉందని, నెలకు రూ.16వేల నుంచి 18వేల దాకా జీతం ఉంటుందని, నాలుగేళ్లపాటు అగ్రిమెంటు ఉంటుందని నమ్మబలికారు. ఇది విన్న నిరుద్యోగి సరే అనగానే వారి నుంచి విద్యార్హత పత్రాలు తీసుకుని ఇంత డబ్బులు చెల్లిస్తే అపాయింట్ మెంట్ లెటర్ వస్తుందని చెప్పడంతో ఆ నిరుద్యోగి అప్పుచేసి డబ్బులు చెల్లించి ఉద్యోగంలో చేరారు. ఆపై జీతాలు రాక, గట్టిగా అడిగితే పెండింగ్ జీతాలు ఇవ్వరేమోనని భయపడిపోయారు. తీరా మోసపోయామని లబోదిబోమంటున్నారు.

చేతులు మారిన లక్షల రూపాయలు

ఫౌండేషన్ సీఈవోనంటూ హైదరాబాదు నగరానికి చెందిన సుజాతఠాకూర్ అనే మహిళ ఉమ్మడి మహబూబ్‌నగర్, కర్నూలు, నంద్యాల, గుంటూరు, విజయవాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో ఉన్న పరిచయస్తుల ద్వారా ఆయా ప్రాంతాల్లో కార్యాలయాలు తెరిపించి నిరుద్యోగులకు వల వేసింది. ఇదే విధంగా అలంపూర్ పట్టణానికి చెందిన ఓ మహిళ కర్నూలులో నివాసం ఉంటుంది. ఆమెను ప్రతినిధిగా నియమించుకుని కర్నూలులో కార్యాలయం ఓపెన్ చేయించి ఏజెంట్ల ద్వారా నిరుద్యోగులను చెరపట్టారు. అలంపూర్ పట్టణానికి చెందిన ఓ దంపతులను ఏజెంట్లుగా ఎంపిక చేసుకొని వీరి ద్వారా నిరుద్యోగులకు ఎర వేశారు. ఇలా వేలాదిమంది నిరుద్యోగుల ద్వారా రూ.50 వేల నుంచి రూ. 2లక్షల దాకా వసూళు చేసి ఫౌండేషన్ సీఈవోకు అందజేశారు. ఆ తరువాత పలుమార్లు సదరు ఫౌండేషన్ సీఈవో కోసం హైదరాబాదు వెళ్లినా ఆమె అచూకీ లభించలేదు. సదరు సీఈవోపైన రెండు తెలుగు రాష్ట్రాలలోని పలు జిల్లాల్లో కేసులు నమోదైనట్లు తెలిసింది.

అలంపూర్ పట్టణంలో బొల్లారం సోమక్క అలియాస్ చిట్టెమ్మ పదోతరగతి వరకు చదివి తోబుట్టువులతో కలిసి కూలీ పనికి వెళ్లేది. మగ దిక్కులేని ఈ మహిళలను పట్టణానికి చెందిన ఓ బ్రోకర్ ద్వారా ఉండవల్లి మండలం, బొంకూరు పాఠశాలలో అటెండర్ పోస్టు ఉందని రూ.80వేలు తీసు కొని నియామక పత్రం అందించారు. ఆమె బొంకూరు పాఠశాలలో అటెండర్‌గా విధుల్లో చేరారు. ఆమెకు మొదటి నెల జీతమే చివరి జీతం అయ్యింది. ఈ విషయంపై వివరణ కోరేందుకు సదరు సంస్థ సీఈవోకు ఫోన్ చేస్తే స్పందించడంలేదు.

బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- బీసీ గణనతో సమాన అవకాశాలు
- పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- పండుగ సాయన్న విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



షాపూర్‌లో పండుగ సాయన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్‌లో బుధవారం పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పండుగ సాయన్న బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీ గణనను 60 రోజుల్లో పూర్తి చేసి బీసీ సామాజిక వర్గానికి న్యాయం చేయడానికి కంకణం కట్టుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంస్కరణలు తెస్తోందని తెలిపారు. గ్రామాల్లో పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ముదిరాజ్ కులస్తుల ఆకాంక్షల మేరకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయిస్తానని తెలిపారు. ధ్వంసమైన బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా మండలంలోని మామిడిమాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సాయిలు, మత్స్యకారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ ఆనిమోని కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తితో.. ముందడుగు



ఫొటోలు తీస్తున్న గీత

- విభిన్న వృత్తుల్లో రాణిస్తున్న మధ్య తరగతి మహిళలు
- కుటుంబ పోషణలో భర్తకు చేదోడువాదోడు

మధ్య తరగతి మహిళలు వారు.. విభిన్న వృత్తుల్లో రాణిస్తూ కుటుంబ పోషణలో భాగస్వాములవుతున్నారు. భర్తకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ముందడుగు వేస్తున్నారు.

- పెద్దకొత్తపల్లి, ఆంధ్రజ్యోతి

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల స్కూల్ ఫీజులతో మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక భారంతో సతమతం అవుతున్నాయి. ఒక్కరే పని చేస్తే కుటుంబం గడవడం కష్టంగా మారింది. దీంతో తాము కూడా కుటుంబ పోషణలో భాగస్వాములం కావాలనుకున్నారు. అందుకు స్వయం ఉపాధిని చక్కని మార్గంగా ఎంచుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో కొందరు మహిళలు ఇళ్లలోనే చిన్న కిరాణం షాపులు నిర్వహిస్తున్నారు. మరికొందరు మహిళలు బ్యూటీ పార్లర్, టీకొట్టు, మిర్చి బండ్లు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నారు.

తద్వారా ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ, కుటుంబ పోషణకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. వారిలో కొందరిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వివరాలు వారి మాటల్లోనే.....

భర్త స్ఫూర్తితో ఫొటోగ్రఫీ

జెరుపటి గీత, శ్రీమిత ఫొటో స్టూడియో, పెద్దకొత్తపల్లి : ఫొటో గ్రాఫర్ అయిన నా భర్త రాజు గ్రామంలో స్టూడియో నిర్వహిస్తున్నారు. మాకు ఇద్దరు మగ పిల్లలున్నారు. వారిని ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాం. స్కూల్ ఫీజులు, ఇంటి అద్దె, తదితర ఖర్చులు పెరిగాయి. మాకు ఫొటో స్టూడియో తప్ప ఇతర ఆర్థిక వనరులు లేవు. కుటుంబ పోషణ కోసం భర్త రాజు ఒక్కరే కష్టపడుతున్నాడు. ఇద్దరం కలిసి సంపాదించుకుంటే ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవనం సాగించొచ్చని అనిపించింది. నా భర్త వద్ద ఫొటోలు, వీడియోలు తీయడం నేర్చుకున్నాను. ఫొటో స్టూడియో నడిపిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచాను. ఈ క్రమంలో నాకు ఫొటోగ్రఫీపై ఆసక్తి పెరిగింది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో 2017-18లో నిజామాబాద్ జిల్లా గాంధరిలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొన్నాను. నేను తీసిన పొలానికి బండిపై వెళ్తున్న రైతు కుటుంబం ఫొటోకు ట్రావెలింగ్ విభాగంలో బహుమతి లభించింది. ఫెడరేషన్ సభ్యుడు రమణ చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నాను. ఖమ్మంలో వెడ్డింగ్ ఫొటో పోటీల్లో బహుమతి పొందాను.



గాంధరిలో బండి రమణ చేతుల మీదుగా షీల్డ్‌ను అందుకుంటున్న గీత

ఉద్యోగాలు రాక మిర్చీల బండి



బజ్జీల బండి నిర్వాహకురాలు వడమోని నాగలక్ష్మి

వడమోని నాగలక్ష్మి : భార్యాభర్తలం ఇద్దరం ఉన్నత చదువులు చదివాం. నేను బీఎస్‌సీ, బీఈడీ, నా భర్త వడమోని నాగరాజు బీఎస్‌సీ, బీఈడీ, ఎంఏ (హిందీ) పూర్తి చేశారు. కానీ ఎంత కష్టపడినా ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదు. ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ విపరీతంగా పెరిగినా ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలు రావాలంటే కష్టమని అర్థం చేసుకున్నాం. మాకు భూములు, ఆస్తుపాస్తులు లేవు. చదివినా ఉద్యోగం రావడం లేదు. బతుకుదెరువు కోసం మిర్చీల బండి పెట్టుకున్నాం. కుటుంబాన్ని పోషించుకుంటూ, పిల్లలను చదివించుకుంటున్నాం. ప్రభుత్వం రుణం అందించి సహకరిస్తే వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటాం.

కుటుంబ పోషణ కోసం టీకొట్టు

చంద్రకళ, పెద్దకొత్తపల్లి : నా భర్త రాముడు ఆటో నడుపుతాడు. అప్పుడప్పుడు శుభకార్యాలకు వెళ్లి వంటలు చేస్తాడు. అలా వచ్చే డబ్బు కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కుటుంబ పోషణ కూడా భారంగా మారింది. ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేశించుకున్నాం. నేను టీకొట్టు ఏర్పాటు చేసుకున్నాను. దీంతో కొంత మేర ఆర్థిక వెసలుబాటు లభిస్తోంది. కుటుంబాన్ని పోషంచుకుంటూ, పిల్లలను చదివించుకుంటున్నాం.



పెద్దకొత్తపల్లిలో టీకొట్టును నడుపుతున్న చంద్రకళ

వ్యాపార అక్రమ సముదాయాల తొలగింపు



మన్ననూరులోని శ్రీశైలం- హైదరాబాద్ రహదారి పక్కన ఉన్న డబ్బాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మన్ననూర్, అక్టోబరు 16: అమ్రాబాద్ మండలం మన్ననూరులో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించుకున్న వ్యాపార సముదాయాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి భీముడు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఒక టీ స్నాక్స్ సెంటర్, మరో కిరాణ డబ్బాను గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సదరు వ్యక్తులకు డబ్బాలను తొలగించాలని గ్రామపంచాయతీ నుంచి నోటీసులు జారీ చేశామని, స్పందించకపోవడంతో పోలీస్ బందోబస్తు నడుమ బుధవారం ఎక్స్‌కవేటర్ల సహాయంతో డబ్బాలను తొలగించామని చెప్పారు. ఇదివరకే గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం ఆవరణలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న డబ్బాలను తొలగించామన్నారు.

మరికొందరికి డబ్బాలు తొలగించాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించి డబ్బాలు వేసుకున్నా, ఇళ్లు నిర్మించుకున్నా అలాంటి కట్టడాలను తొలగిస్తామని గ్రామ కార్యదర్శి తెలిపారు.

పైసా వసూల్

- గద్వాల జిల్లాలో ప్రతీ పనికి వాటాలు అడుగుతున్న ఓ నాయకుడు

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకున్న పరిస్థితి నెలకొంది. మొదట్లో ఇసుక రీచ్ తమకే రావాలని పట్టుబట్టగా.. తర్వాత తాము అడిగినంత కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక టిప్పర్‌కు రూ.2,000 వరకు ఇస్తే తమకు గిట్టుబాటు కాదని తెలుపగా.. స్థానికులతో కలిసి ఇసుక తరలింపును అడ్డుకున్నారు. టీఎస్‌ఎండీసీ ఇసుక రవాణా లేకపోవడంతో జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఏర్పడింది. అలాగే భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా కూడా కొంత అధికారుల స్థాయి నుంచే కాంట్రాక్టు సంస్థలతో ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జరిగాయి. 60 శాతం మాత్రమే ట్రాన్స్‌ఫర్లు చేయాల్సి ఉండగా, 100 శాతం ట్రాన్స్‌ఫర్లు చేశారు. సదరు పంచాయతీ కార్యదర్శులు గగ్గోలు పెట్టడంతో వారి నుంచి కొంతమేర తీసుకుని కొందరిని వారు కోరుకున్న స్థానాలకు తర్వాత బదిలీ చేసినట్లు విమర్శలు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శుల విషయంలోనే మాజీ ప్రజాప్రతినిధికి.. ప్రస్తుత ప్రజాప్రతినిధికి మధ్య కొంత అంతరం ఏర్పడినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ముంగిట ఉన్న నేపథ్యంలో అధిష్ఠానం దృష్టి పెట్టకపోతే మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

న్యూస్ బాక్స్

ఇథనాల్ ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్థులు



కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు

వడ్డేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పెద్దధన్వాడ గ్రామంలో బుధవారం ఇథనాల్ ప్లాంట్ నిర్మాణ పనులను ఐదు గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. కంపెనీ నిర్మాణం వల్ల పంటలతో పాటు ప్రజలు అనారోగ్యానికి గురవుతామని కంపెనీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కలుకుంట్ల, ఎర్రవల్లి చౌరస్తాలో ఉన్నటువంటి ఫ్యాక్టరీల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. శాస్త్రవేత్తలతో ఎలాంటి ప్రమాదం లేదని తేల్చి చెప్పిన తర్వాతనే నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. ఈ కంపెనీ నిర్మాణం వల్ల ఊపిరితిత్తులు, నాడీ వ్యవస్థ, చర్మవాధ్యులు ప్రబలుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ నిర్మాణ పనులు చేపడితే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. గ్రామపెద్దలు అలెగ్జాండర్, జయరామిరెడ్డి, రెహమాన్, రవిరెడ్డి, నాగరాజు, లోకేష్‌రెడ్డి ఉన్నారు.

రేపటి నుంచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికలు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులకు ఈ నెల 18నుంచి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ గేమ్స్ ఎంపికలను పీయూ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు బుధవారం పీయూ పీడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న పురుషుల విభాగం బ్యాడ్మింటన్, 19న పురుషుల విభాగం తైక్వాండో, మహిళలు, పురుషుల విభాగాల కబడ్డీ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను బ్యాడ్మింటన్ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. తైక్వాండో పోటీలు గురునానక్ యూనివర్సిటీలో, మహిళలు, పురుషుల విభాగాల్లో కబడ్డీ పోటీలు అలగప్ప యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

మన్ననూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్య ప్రాంతంలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు అమ్రాబాద్ ఎస్ఐ ఖాద్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన ఈదమయ్య (35) ఈ నెల 14న శ్రీశైలం వెళ్లేందుకు వచ్చి మన్ననూరుకు సమీపంలో ఉన్న దారవాగు బేస్ క్యాంపు వద్ద బైక్ మాత్రమే కనిపించింది. వ్యక్తి అదృశ్యమైనట్లుగా బాధితుడి తల్లిదండ్రులు, భార్య అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అటవీ శాఖ సిబ్బంది సహాయంతో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఈదమయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆచూకీ కనుగొనేందుకు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెరుచుకోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

- ఫీజు రీయింబర్స్‌మెంటు కోసం సమ్మెలో యాజమాన్యం - తరగతులు జరగక నష్టపోతున్న విద్యార్థులు



నాగర్‌కర్నూల్‌లోని విశ్వ వికాస్ డిగ్రీ కళాశాల గేటుకు ఉంచిన నిరవధిక బంద్ నోటీస్ ఫ్లెక్సీ



నాగర్‌కర్నూల్ సాధన డిగ్రీ కళాశాలను మూసి ఉంచి బుధవారం సమ్మె చేస్తున్న యాజమాన్యం

నాగర్‌కర్నూల్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదని ఆరోపిస్తూ, ఈ నెల 14 నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం సమ్మె బాట పట్టాయి. దీంతో దసరా సెలువులు ముగిసినా జిల్లాలో నిర్వహిస్తున్న తొమ్మిది ప్రైవేటు డిగ్రీ కళాశాలలు నేటికీ తెరుచుకోలేదు. ఈ కళాశాలల్లో సుమారు 4 వేల 500 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ సంవత్సరానికి 5 కోట్ల చొప్పున మూడేళ్లకు బకాయిలు 15 కోట్ల రూపాయలు రావాల్సి ఉంది. కళాశాల గేట్లకు తాళం వేసి నిరవధిక బంద్ బోర్డులు ఉంచి మూసి ఉంచారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆర్థికంగా దెబ్బతిన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలకు ఫీజు రీఎంబర్స్‌మెంటు రాబట్టుకోవడం కోసం ఈ చర్యకు పూనుకున్నట్లు యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఫీజు రీఎంబర్స్‌మెంటు చెల్లించాలని తాము ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సానుకూల స్పందన రాకపోవడంతోనే తప్పని పరిస్థితుల్లో కళాశాలలను మూసి వేసి సమ్మె చేయాల్సి వచ్చిందని యాజమాన్యం అంటున్నారు. నాగర్‌కర్నూల్‌తో పాటు కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేస్తున్నారు.

● **నష్టపోతున్న విద్యార్థులు**

ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూసి ఉంచి యాజమాన్యాల నిరవధిక బంద్ చర్యల కారణంగా తరగతులు జరకగ విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోయే ప్రమాదం దాపురించింది.

పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో జిల్లాలో మొత్తం తొమ్మిది ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉండగా నాగర్‌కర్నూల్‌లో రెండు, అచ్చంపేటలో మూడు, కల్వకుర్తిలో రెండు, కొల్లాపూర్, తెలకపల్లిలో ఒక్కో కళాశాలను నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలన్నీ దసరా సెలవుల్లో మూసి వేశాక సెలవుల అనంతరం యాజమాన్యాల సమ్మె కారణంగా తిరిగి పునఃప్రారంభం కాలేదు.

ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంటు మీదనే ఆధారపడి ప్రైవేటు కళాశాలల్లో చేరిన విద్యార్థులు కళాశాలలు తెరిచి తరగతులు నిర్వహించాలని యాజమాన్యాలను నిలదీయలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంటు చెల్లించి యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

చెల్లించే వరకు సమ్మెను కొనసాగిస్తాం



రాష్ట్ర వ్యాప్తంగా 2021- 22 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంటు అందడం లేదు. కళాశాల విద్యార్థుల సంఖ్యను బట్టి జిల్లాలో ఒక్కో కళాశాలకు దాదాపుగా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ప్రభుత్వం నుంచి ఫీజులు రావాల్సి ఉంది. అకాడమిక్ పూర్తయిన విద్యార్థులు ఫీజులు చెల్లించకున్నా వారి సర్టిఫికెట్స్ ఇస్తున్నాం. దీంతో కళాశాల నిర్వహణ, అధ్యాపకులకు వేతనాలు చెల్లించడం కోసం ఇబ్బంది పడుతున్నాం. రీయింబర్స్‌మెంటు చెల్లించే దాక సమ్మె కొనసాగిస్తాం.

- శ్రీనివాస్, సాధన డిగ్రీ కళాశాల యజమాని, నాగర్‌కర్నూల్

ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంటు పథకం ఉండటంతోనే చాలా మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చేరి విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించి విద్యార్థులు నష్టపోకుండా చూడాలి.

- తారాసింగ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్

సమయస్ఫూర్తితో రాణించాలి

● డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్

గద్వాల అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి సమయస్ఫూర్తితో రాణిస్తే తమ జట్టు విజయానికి దోహదపడతారని డీవైఎస్ఓ డాక్టర్ బీఎస్ ఆనంద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర క్రికెట్ లీగ్ కమ్ నాకౌట్ మూడవ రోజు పోటీలకు డీవైఎస్‌వో హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

ప్రతీ విద్యార్థి ఏదో ఒక క్రీడను ఎంచుకుని అందులో రాణిస్తే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.జితేందర్, టోర్నమెంట్ పరిశీలకుడు పాల్, కోకన్వీనర్ బీసన్న, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి భరత్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు నగేష్‌బాబు, బషీర్, సతీష్, రజనీకాంత్ ఉన్నారు.

● **ముగిసిన లీగ్ దశ**

జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ లీగ్ దశ పోటీలు ముగిశాయి. మూడవ రోజు పూల్-బిలో రంగారెడ్డి జిల్లా జట్టు అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జట్లపై లీగ్ పోటీల్లో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరింది. అలాగే నల్గొండ జిల్లా జట్టు నిజామాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జట్లపై మూడు మ్యాచ్‌లు గెలిచి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. కాగా, గురువారం మొదటి సెమీ ఫైనల్‌లో నల్గొండ, రంగారెడ్డి తలపడనున్నాయి.

అలాగే పూల్-ఎ గ్రూప్‌లో హైదరాబాద్ జట్టు మెదక్, ఖమ్మం, వరంగల్ జట్లపై మూడు మ్యాచ్‌లు గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకుంది.

● **సెమీస్‌కు చేరిన మహబూబ్‌నగర్ జట్టు**

అలాగే మహబూబ్‌నగర్ జట్టు వరంగల్, మెదక్ జట్లపై గెలిచి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. రెండవ సెమీ ఫైనల్‌లో మహబూబ్‌నగర్, హైదరాబాద్ జట్లు తలపడున్నట్లు కన్వీనర్ శ్రీనివాసులు, కోచ్ శ్రీను తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

» మృతుడు డీసీసీ మాజీ అధ్యక్షుడి కుమారుడు
» సంతాపం తెలిపిన ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు



రామచంద్రారెడ్డి (ఫైల్)

గద్వాల, అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని దయ్యాలవాగు వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పటేల్ రామచంద్రారెడ్డి (28) మృతి చెందాడు. అతడు కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలం కుర్తిరావుల చెరువు గ్రామానికి చెందిన డీసీసీ మాజీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పటేల్ అరుణ గద్వాలలో నివసిస్తున్నారు. వారి కుమారుడు పటేల్ రామచంద్రారెడ్డి వ్యాపార వ్యవహారాలు చూసుకుంటారు. ఆయన బుధవారం తెల్లవారుజామున ఎర్రవల్లి నుంచి గద్వాలకు కారులో వస్తుండగా, దయ్యాల వాగు దగ్గర బ్రిడ్జి సైడ్‌వాల్‌ను బలంగా ఢీ కొన్నది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో, రామచంద్రారెడ్డి అపస్మారక స్థితికి చేరాడు. అదే దారిలో ప్రయాణిస్తున్న వాహన దారులు గమనించి పోలీసులకు ఫోన్ చేశారు. దీంతో వారు అక్కడికి చేరుకొని ఆయనను అంబులెన్స్‌లో గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలిసిన వెంటనే ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు, బంధువులు విగతజీవిగా మారిన తమ కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా రోదించారు. అప్పటికే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి సమాచారం తెలియడంతో ఆసుపత్రికి చేరుకొని తల్లిదండ్రులను ఓదార్చారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం కుర్తిరావులచెరువుకు తరలించారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, గద్వాల మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సీడ్ ఆర్గనైజర్లు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో గద్వాల ఎమ్మెల్యే పాల్గొని పాడెను మోశారు.

బ్రహ్మోత్సవాలకు కురుమూర్తి ఆలయం ముస్తాబు

- ముమ్మరంగా రంగులు వేస్తున్న కూలీలు



ఆలయ మెట్లకు రంగులు వేస్తున్న కూలీలు

చిన్నచింతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. కలియుగ ప్రత్యేక్ష దైవం, పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న కురుమూర్తి వేంకటేశ్వరస్వామి క్షేత్రం తెలంగాణ ప్రాంతంలోనే ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా పేరుంది. కాగా, స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. తెలంగాణ ప్రాంతంలోనే పేరొందిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 31నుంచి యాగశాల మంటపాలంకరణతో ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 6న స్వామి వారి అలంకారోత్సవం, 8న ఉద్దాలోత్సవం జరుగనుంది. అలాగే స్వామి వారు ప్రతి రోజూ వివిధ రకాల వాహనసేవల్లో ఊరేగనున్నారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోనున్నారు. అయితే కేవలం ఒక్క ఉద్దాలోత్సవం రోజే దాదాపు మూడు లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోవటం విశేషం.

నేడు ఏర్పాట్లపై సమీక్ష

చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 31నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈవో మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి కలెక్టర్ విజయేందిరబోయి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలకవర్గం సభ్యులతో పాటుగా వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



భూత్పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దాయాదులు దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో శవమై తేలాడు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన అనుప కృష్ణయ్య (70) ఈ నెల 12న దాయాదులతో గొడవపడ్డాడు. వారు తనను దూషించారని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పి మరుసటి రోజు ఇంటి నుంచి బయటక వెళ్లాడు. రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు లక్ష్మీనారాయణ ఈనెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అతడి మృతదేహం గ్రామ శివారులోని కతికేవాని చెరువులో తేలింది. గమనించిన రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పది మంది బైండోవర్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన పది మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. పొలం విషయంలో దాయాదులైన వారి మధ్య కొన్ని రోజులుగా తగాదాలు జరుగుతున్నాయి. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. తరుచూ ఘర్షణ పడుతుండటంతో పోలీసులు బుధవారం వారిని తహసీల్దార్ హరికృష్ణ ముందు ప్రవేశపెట్టారు. గొడవలకు కారణమైన పది మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గద్వాల, అక్టోబరు 16 : (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని జములమ్మ స్టేజీ సమీపంలోని ఓ లాడ్జిలో నిర్వహిస్తున్న పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 13 మందిలో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,00,790 తో పాటు పేకాట ముక్కలు, 12 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ నుంచి గుడిపల్లికి వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు గంధంబాయి వద్ద బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముదిరాజ్ బుజ్జయ్య (75)ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు అతడి కుమారుడు లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వీపనగండ్ల, అక్టోబరు 16,(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఎస్ఐ రాణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం గోవర్ధన్‌దిన్నె గ్రామానికి చెందిన మిట్టకడుపుల మహేష్ హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం రాత్రి అతడి తల్లి దండ్రులు గొడవపడ్డారు. వద్దని మహేశ్ నచ్చచెప్పినా వారు వినలేదు. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు అతడిని వనపర్తి ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్య కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెళకువలతో పని సులభం

బిజినేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సరైన మెళకువలు పాటిస్తే పైప్‌లైన్ పనులు సులభతరం అవుతాయని మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి రైతు వేదికలో బుధవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. నీటి నాణ్యత గుర్తింపు, చేతి పంపులు, మోటార్ల నిర్వహణ, మరమ్మతు తదితరాలపై అవగాహన కల్పించారు.



ఓల్డ్ ఈజ్ గోల్డ్

- కల్తీ లేని గానుగ నూనెపై ప్రజల ఆసక్తి
- గండీడు మండలం జక్లపల్లిలో తయారీ
- ఒక కట్టె గానుగతో ప్రారంభించిన జయమ్మ
- ప్రస్తుతం తొమ్మిది గానుగలు, 20 మందికి ఉపాధి
- విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న నూనె

మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌ల నూనెలు లభ్యం అవుతున్నాయి. వాటిలో ఏది నాణ్యమైనది.. ఏదీ కల్తీ.. అన్న సందేహాలతో సతమతం అవుతున్న జనం ఇప్పుడు 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అంటున్నారు. పురాతన పద్ధతిలో తయారు చేస్తున్న గానుగ నూనెపై ఆసక్తి చూపుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడు మండలం జక్లపల్లిలో ఈ గానుగ నూనె తయారవుతోంది. అలాగే మహబూబ్‌నగర్ పట్టణంలో యంత్రం గానుగతో తయారు చేస్తున్న నూనెకు కూడా డిమాండ్ బాగానే ఉంటోంది. ఈ సందర్భంగా తయారీదారులతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. ఆ వివరాలు మీ కోసం...

- గండీడు, పాలమూరు (ఆంధ్రజ్యోతి)

ప్రపంచాన్ని వణికించిన కరోనా విపత్తు తర్వాత అందరికీ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ పెరిగింది. అందులో భాగంగా నాణ్యమైన, స్వచ్ఛమైన



గానుగ నూనె ప్యాకెట్లు

ఆహార పదార్థాలపై దృష్టి సారిస్తున్నారు. నిత్యం వంటలకు వినియోగించే నూనెల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మార్కెట్లో దొరికే వివిధ బ్రాండ్ల నూనెలకు బదులు పురాతన పద్ధతిలో తయారు చేసిన గానుగ నూనె వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు.

వైద్య కోసం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి...

గండీడు మండల పరిధిలోని జక్లపల్లికి చెందిన బుచ్చిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న తన సతీమణి జయమ్మ వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు ఖాదర్‌వలీ దగ్గరకు వెళ్లారు. అక్కడ రోగుల కోసం ఎద్దుల గానుగతో నూనె తయారు చేయడం చూశారు. జయమ్మను కూడా గానుగ నూనె వాడాలని వైద్యుడు సూచించారు. మొదట్లో ఇతరులు తయారు చేసిన నూనెను వాడిన ఆమెకు సంతృప్తి కలుగలేదు. తామే స్వయంగా తయారు చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఎద్దు సాయంతో నడిచే కట్టె గానుగతో తమ పొలంలో ఏర్పాటు చేసుకొని, నూన తయారీ ప్రారంభించారు. మొదట్లో తమ కుటుంబానికి సరిపోయేటంత మాత్రమే ఉత్పత్తి చేశారు. ఆ తర్వాత గ్రామస్థులతో పాటు, చుట్టు పక్క గ్రామాలకు చెందిన వారు కూడా నూనె కొనుగోలుకు ఆసక్తి చూపించారు. దీంతో బుచ్చిరెడ్డి, జయమ్మ దంపతులు తొమ్మిది గానుగలను ఏర్పాటు చేశారు. 10 జంటలకు ఉపాధి కల్పించారు.

ఎన్నోరకాల నూనెలు

వంటల కోసం పల్లీ నూనెతో పాటు ఆవాలు, కుసుమ, కొబ్బరి, నువ్వుల నూనెలు, వ్యవసాయానికి ఉపయోగించే వేప, కానుగ నూనెలు, ఆయుర్వే విద్యానికి వినియోగించే బాదం, గడ్డినువ్వులు, అవిసె, ఇప్ప, నువ్వులు, ఆముదం నూనెలను తయారు చేస్తున్నారు. ఒక గానుగను రెండు గంటలు నడిపిస్తే 15 నుంచి 18 కిలోల నూనె తయారవుతుంది. తాము ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు పంపిస్తున్నాం. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలతో పాటు సింగపూర్, దుబాయ్ వంటి దేశాలకు కూడా ఎగుమతి అవుతోంది. ఈ నేపథ్యంలో వారికి జాతీయ స్థాయిలో బెస్ట్ సోషల్ ఇంపాక్ట్ రూరల్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ పురస్కారం లభించింది. అయితే జయమ్మ ఆరు నెలల క్రితం మృతి చెందింది. ప్రస్తుతం ఆమె భర్త కోట్ల బుచ్చిరెడ్డి, కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి గానుగను కొనసాగిస్తున్నారు.

అందరికీ ఆరోగ్యం.. అదే మా లక్ష్యం



ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మా లక్ష్యం. అందుకే ఎద్దుల గానుగతో స్వచ్ఛమైన నూనె తయారు చేసి విక్రయిస్తున్నాం. మూడు షెడ్లలో తొమ్మిది గానుగలు ఏర్పాటు చేసి, 20 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. మేము తయారు చేసిన నూనెలు హైదరాబాద్‌తో పాటు, ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. మేము చేసిన ఓ చిన్న ప్రయత్నం మాకు జాతీయ స్థాయి పురస్కారాన్ని అందించింది. ముడి సరుకు మార్కెట్ ధరను బట్టి నూనె ధరలు ఉంటాయి.

- బుచ్చిరెడ్డి, జక్లపల్లి

రోగ నిరోధక శక్తి పెరుగుతుంది



ఎద్దుల గానుగ నూనె వినియోగించడం ఆరోగ్యానికి మంచిది. ఈ నూనె గుండె జబ్బులను నిరోధిస్తుంది. కల్తీ నూనెల కంటే ప్రకృతి సిద్ధంగా తయారయ్యే నూనెలను వాడటం వల్ల రోగ నిరోధక శక్తి కలుగుతుంది. కొలెస్ట్రాల్ తగ్గి, రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.

- డాక్టర్ చంద్రశేఖర్, వైద్యాధికారి, గండీడ్

తరతరాలుగా గానుగ నిర్వహణ

పాలమూరు : మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎర్రసత్యం చౌరస్తాలో 1983 నుంచి నూనె గానుగలు కొనసాగుతున్నాయి. పది కిలోల పల్లీలకు ఆరు కిలోల నూనె వస్తుంది. పిండి, పిప్పి మిగులుతుంది. వారే స్వయంగా పల్లీలు, నువ్వులు, పొద్దు తిరుగుడు, కుసుమలతో నూనె తయారు చేసి విక్రయిస్తుంటారు. ఎవరైనా గింజలు తీసుకొస్తే గానుగ ఆడించి నూనె తీసి ఇస్తారు. పిప్పి మాత్రం వారే తీసుకొని, కిలో రూ.30 చొప్పున రైతులకు విక్రయిస్తారు. ఆ పిప్పిని పశువుల దాణా కోసం పాడి రైతులు కొనుగోలు చేస్తారు. దీన్ని దాణాలో కలిపి మేపితే అధికంగా పాలు ఇస్తాయని రైతులు చెప్తున్నారు.



మహబూబ్‌నగర్‌లోని గానుగ యంత్రం

తాతల కాలం ఇదే వృత్తి



తాతల కాలం నుంచి ఇదే వృత్తిలో ఉన్నాం. మేము ఒకే సారి టోకున పల్లీలు కొంటాం కాబట్టి మార్కెట్ కంటే తక్కువ ధరకు వస్తాయి. కిలో పల్లీ ఆయిల్ 180కి అమ్ముతాం. మిగిలిన పిప్పిని విక్రయిస్తాం కాబట్టి నష్టం భర్తీ అవుతుంది. కొందరు మేము తయారు చేసిన నూనెను కొంటారు. మరికొందరు గింజలు తీసుకొచ్చి నూనె పట్టించుకుంటారు.

- శ్రావణ్‌కుమార్, గానుగ యజమాని

క్రీడా సమాచారం

నెట్‌బాల్ మహిళా జట్టు కోచ్‌గా విక్రమాదిత్యరెడ్డి



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భారత మహిళా జట్టు కోచ్‌గా మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన విక్రమా దిత్యరెడ్డి నియమితులయ్యారు. నెట్‌బాల్ సం ఘం రాష్ట్ర అధ్యక్షుడైన ఆయన కర్ణాటక రాష్ట్రం, బెంగళూరులోని కోరమండల్ ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న ఏషియన్ ఉమెన్స్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత మహిళా జట్టు కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఆయనకు అవకాశం లభించడంపై సంఘం సభ్యులు ఖాజాఖాన్, సోహెల్ ఉర్ రెహమాన్, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

22న కబడ్డీ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి జిల్లా అండర్-19 బాల, బాలకల కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 పాపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం తొమ్మిది గంటలకు పోటీలకు హాజరు కావాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని కళాశాల విద్యార్థులు బోనఫైడ్, పదవ తరగతి మెమో జిరాక్స్ పత్రాలు తీసుకొని రావాలని సూచించారు.

19న కరాటే, వాలీబాల్, అర్చరీ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఉమ్మడి జిల్లా కరాటే, అర్చరీ, వాలీబాల్ జట్ల ఎంపికలు ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో కరాటే ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 2011, జనవరి ఒకటి తరువాత జన్మించిన వారు అండర్ - 14కు, 2008, జనవరి ఒకటి తరువాత పుట్టిన వారు అండర్ - 17 విభాగానికి అర్హులని పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు స్టేడియం మైదానంలో అండర్-14, 17 బాల, బాలికల అర్చరీ జట్ల ఎంపికలు ఉంటాయని తెలిపారు. అలాగే అడ్డాకుల మండలంలోని వేముల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వాలీబాల్ అండర్-17 బాల, బాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు.

కన్న కొడుకులు వేధిస్తున్నారు

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు

నవాబ్‌పేట అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కుమారులు వేధిస్తున్నారని, తన పేరున ఉన్న భూమిని ఇతరులు సాగు చేసుకునేందుకు ఇచ్చారని ఓ వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన శంకరమ్మ భర్త పకీరయ్య పేరున 15 ఎకరాల పొలం ఉంది. ఆ భూమిని ముగ్గురు కుమారులకు పంచి, సర్వే నంబరు 84, 88లలో 38 గుంటల భూమి శంకరమ్మ పేరున పెట్టారు. ఆమె భర్త పకీరయ్య చనిపోయిన తర్వాత చిన్న కుమారుడి దగ్గర ఉంటోంది. కాగా ఆమె పేరునున్న భూమిని ఎవరు అనుభవిస్తే, వారే ఆమె బాధ్యతను చూసుకోవాల్సి ఉంటుందని పంపకాల సమయంలో ఒప్పందం చేసుకున్నారు. కానీ మరో కుమారుడు ఆ భూమిని వేరే వారికి సాగు చేసుకునేందుకు ఇచ్చారని, తనను చూసుకోవడం లేదని శంకరమ్మ ఆవేదన వ్యక్తం



పోలీస్‌స్టేషన్ ముందు కూర్చున్న శంకరమ్మ

చేసింది. వృద్ధురాలి నైన తనను కుటుంబ సభ్యులే వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

- రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కొత్తగూడ శివారులో ఘటన
- వారి స్వగ్రామం ముష్టిపల్లిలో విషాదఛాయలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధ దంపతులు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం కొత్తగూడ శివారులో మంగళవారం రాత్రి దారుణహత్యకు గురయ్యారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముష్టిపల్లి గ్రామానికి చెందిన చింతలపల్లి మనోహర్‌రావుకు రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడలో మామిడి తోట ఉంది. తోటకు కాపలా కోసం అదే గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మూగ చిన్న ఉషన్న (60), మూగ శాంతమ్మ(58)లను నియమించుకున్నారు. వారిద్దరూ తోటలోని రేకుల షెడ్డులోనే నివసిస్తూ పని చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఉషన్న తలను నరికి, శాంతమ్మ గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. హత్యకు పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. వారికి ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. జీవనపోధి కోసం వలస వెళ్లిన వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురి కావడంతో వారి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



హత్యకు గురైన వృద్ధ దంపతులు చిన్న ఉషన్న, శాంతమ్మ (ఫైల్)

మహిళపై దాడి, కేసు నమోదు

కేటీదొడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాత గొడవలను మనసులో ఉంచుకొని ఓ వ్యక్తి మహిళపై దాడి చేశాడు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని చింతల కుంట గ్రామానికి చెందిన కుర్వ మల్లమ్మ మంగళవారం రాత్రి చికిత్స కోసం ఆర్‌ఎంపీ డాక్టర్ దగ్గరకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన మీసాల వీరన్న భూమికి సంబంధించిన పాత గొడవలు మనసులో పెట్టుకొని ఆమెను అడ్డుకున్నాడు. దుర్భాషలాడుతూ దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు కుర్వ మల్లమ్మ పోలీసు లకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులో బంగారు నగలు చోరీ

- ప్రయాణికులందరినీ తనిఖీ చేసినా దక్కని ఫలితం
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి కల్వకుర్తికి వెళ్తున్న బస్సులో తొమ్మిది తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.సువర్ణ కుమారుడితో కలిసి ఆర్టీసీ బస్సులో నాగర్‌కర్నూల్ నుంచి కల్వకుర్తికి వెళ్తోంది. మంతటి గేటు సమీపంలో తన బ్యాగు చూసు కోవడంతో అందులోని నగల పెట్టె కనిపించలేదు. ఆమె వెంటనే డ్రైవర్‌కు విషయం చెప్పింది. దీంతో అతడు బస్సును ఆపి అందరినీ తనిఖీ చేశారు. విషయం నాగర్‌కర్నూల్ పోలీసులకు తెలియడంతో వారు కూడా ఒక్కొక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయినా ఫలితం లేకపోయింది. పెట్టెలోని మూడున్నర తులాల నల్లపూసల దండ, మూడు తులాల నెక్లెస్, తులన్నర కమ్మలు, బుట్టలు, వంకీ రింగు మొత్తం కలిపి తొమ్మిది తులాల బంగారం చోరీ అయినట్లు బాధితురాలు తెలిపారు. ఈ మేరకు ఆమె నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పీయూ వీసీగా వచ్చేదెవరు..?

- ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడంతో డిమాండ్
- ముగిసిన సెర్చ్ కమిటీ సమావేశం
- రాజ్ భవన్‌కు చేరిన ముగ్గురి పేర్లు
- నేడో, రేపో పేరు ప్రకటించే అవకాశం

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పోస్టుకు ఎవరు వస్తారని ఉమ్మడి జిల్లా పరిధిలో విద్యావేత్తలు, విద్యార్థుల మధ్య విస్తృత చర్చ కొనసాగుతోంది. వీసీ ప్రకటనపై ప్రభుత్వం నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్న కొద్దీ రోజు కొత్త పేరు తెర మీదకు వస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని 11 యూనివర్సిటీలు ఉండగా, ఉస్మానియా, అంబేద్కర్ యూనివర్సిటీల తర్వాత వీసీ పోస్టుకు అత్యధికంగా 159 మంది దరఖాస్తు చేసుకు న్నారు. పాలమూరు యూనివర్సిటీకి ఐదవ రెగ్యులర్ వీసీ పదవి కోసం ఇటు పీయూలో పని చేసిన మాజీ వైస్ చాన్సలర్‌లు, మాజీ రిజిస్ట్రార్‌లు, అటు ఓయూ, కేయూలతో పాటు ఇతర యూని వర్సిటీల సీనియర్ ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకు న్నారు. వారిలో కొందరు పదవిని దక్కిం చుకునేందుకు రాష్ట్ర, జాతీయ నాయకులతో పైరవీలు చేసుకున్నట్లు సమాచారం. పీయూ వీసీ పదవికి ఇంత డిమాం డ్ రావడానికి కారణం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడం ఒకటైతే, యూనివర్సి టీకి కేంద్రం నుంచి ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అబియాన్ నుంచి రూ.100 కోట్లు మంజూరు కావడం మరో కారణమని చెప్పవచ్చు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు వచ్చే అవకాశం ఉన్నందున పోటీ ఎక్కువగా ఉందని సమాచారం.

ఎవరికి ఎక్కువ అవకాశం

పాలమూరు యూనివర్సిటీ ఏర్పాటు తర్వాత పదహారు సంవత్సరాల కాలంలో నలుగురు రెగ్యులర్ వీసీలు, ఇద్దరు ఇన్‌చార్జి వీసీలుగా కొంత కాలం పని చేశారు. రెండు సార్లు వివిధ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులను ఇన్‌చార్జీలుగా నియమించారు. అయితే యూనివర్సిటీ మొదటి వీసీ జనరల్ కేటగిరీకి చెందిన వారు కాగా, రెండవ వీసీ బీసీ సామాజికవర్గానికి చెందిన వారు కొనసాగారు. మూడు, నాలుగవ వీసీలు కూడా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఇన్‌చార్జి వీసీలుగా పనిచేసిన వారిలో ఒకరు జనరల్ కేటగిరీకి చెందిన ప్రొఫెసర్ కాగా, ఎస్సీ, మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు ఐఏఎస్‌లలో ఒకరు ఇన్‌చార్జి వీసీగా పని చేశారు. మరొకరు ప్రస్తుతం ప్రత్యేకాధికారి హోదాలో వీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మూడు సంవత్సరాల పదవీకాలం ఉన్న రెగ్యులర్ వీసీ పదవీ కాలం మే 21న ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారి హోదాలో రాష్ట్ర ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ వీసీగా కొనసాగుతున్నారు. అయితే ఇప్పటివరకు రెగ్యులర్ వీసీలుగా ఎస్సీ, మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం రాలేదు కాబట్టి వారికే ఇస్తారని, లేదు మహిళకు ఇచ్చే ఛాన్స్ ఉందని, కాదు బీసీలకు అవకాశం ఇస్తారంటూ వివిధ రకాలుగా చర్చలు కొనసాగుతున్నాయి.

త్వరలోనే ఉత్కంఠకు తెర

పాలమూరు యూనివర్సిటీ ఐదవ రెగ్యులర్ వీసీగా ఎవరు వస్తారనే ఉత్కంఠకు త్వరలోనే తెరపడనున్నది. ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ (సీఎస్, యూజీసీ నామినీ, ఎగ్జిక్యూటివ్ నామినీ) పరిశీలించి ఈ నెల మూడున ముగ్గురి పేర్లను ఫైనల్ చేసి రాజ్‌భవన్ పంపించారు. అన్ని యూనివర్సిటీలకు చాన్సలర్ అయిన గవర్నర్ వాటిని పరిశీలించి, ఒకరిని యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రకటిస్తారు. అయితే రాష్ట్రంలోని రెండు యూనివర్సిటీలకు సంబంధించి సెర్చ్ కమిటీ సమావేశాలు పెండింగ్‌లో ఉన్నందున వీసీల ప్రకటనలో ఇప్ప టివరకు జాప్యం జరిగింది. ఈ నెల 15న మంగళ వారం అవి కూడా పూర్తి కావడంతో రాజ్‌భవన్‌కు ఫైల్ చేరింది. దీంతో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వీసీలను ప్రకటించడమే తరువాయి అని ఉన్నత విద్యా మండలిలో ఓ అధికారి తెలిపారు.



మహబూబ్‌నగర్ పట్టణంలోని పాలమూరు యూనివర్సిటీ

స్వాగతం పలికేందుకు సర్వం సిద్ధం

గవర్నర్ పేషి నుంచి తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్, మహిళా విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జీ వీసీని ఇప్పటికే ప్రకటించారు. మిగిలిన యూనివర్సిటీల వీసీల జాబితా నేడో రేపో వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పాలమూరు యూనివర్సిటీకి కొత్తగా వచ్చే వైస్ చాన్సలర్‌కు స్వాగతం పలికేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అయిజ పట్టణాభివృద్ధే లక్ష్యం

» మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డి



అయిజ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని అయిజ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డి అన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి తనకు కేటాయించిన విధులను నిబంధనలకు లోబడి నిర్వహించాల్సి ఉంటుందని, అందుకు ప్రజల సహకారం అవసరం అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలియజేశారు.

అయిజ ప్రధాన రహదారి రోడ్డు ఆక్రమణల తొలగింపు ఎక్కడ లేని విధంగా కఠినంగా ప్రవర్తిస్తున్నారు?

అయిజ పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్డు ఆక్రమణల తొలగింపు నిష్పక్షపాతంగా చేపట్టాము. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలి.

రోడ్డు ఆక్రమణల తొలగింపుతో చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు. వారికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

రోడ్డున పడ్డ చిరువ్యాపారుల కోసం సమీకృత మార్కెట్ సముదాయాలకు టెండర్లు నిర్వహిస్తున్నాము. ఇందులో అన్ని రకాల రిజర్వేషన్లు అమలు పరుస్తూ అందరికీ న్యాయం చేకూరేలా చర్యలు చేపడుతాం.

ఏ పద్ధతిన టెండర్లు నిర్వహిస్తారు?

రిజర్వేషన్‌లతో కూడిన బహిరంగ వేలం ద్వారా టెండర్లు నిర్వహిస్తాము. ఇందులో పాల్గొనేవారు కొంత మొత్తం డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. వేలంలో దుకాణం దక్కించుకున్నవారి డబ్బును డిపాజిట్ కింద జమ చేస్తాం. దుకాణం దక్కని వారికి డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లిస్తాం. టెండర్ల తేదీ త్వరలో ప్రకటిస్తాం.

బాధ్యతగా విధులు నిర్వహించాలి : కలెక్టర్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నూతన ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ బీ.ఎం.సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో డీఎస్సీ-2024లో కొత్తగా నియమితులైన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు నియామక పత్రాలు కలెక్టర్ అందజేశారు. అదనపు కలెక్టర్ నర్సింగ రావు, జడ్పీసీఈవో కాంతమ్మ ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

గట్టు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మండలంలో అక్షరాస్యత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని గట్టు ఎంఈవో నల్లారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మండలానికి స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జీటీ, భాషా పండితుల విభాగాల్లో ఎంపికైన 18 మందికి నియామకపత్రాలు అందజేశారు.

విధుల్లో చేరిన కొత్త టీచర్లు

మానవపాడు, అక్టోబరు 16 (ఆంధజ్యోతి) : మానవపాడు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్న డీఎస్సీ అభ్యర్థులు ఎంఈవో శివప్రసాద్‌కి ప్రతాలు అందించి విధుల్లోకి చేరారు. మానవపాడు, ఉండవెల్లి పరిధిలోని పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు వచ్చారని, రాజేశ్వరి మారమునగాల, నాగరాజు ప్రాగటూరు, మహేష్ కొర్విపాడు పాఠశాలకు నియమితులైనట్లు ఎంఈవో తెలిపారు. పీఆర్టీయూ నాయకులు వేణుగోపాల్, రియాజ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థులు విదేశాలలో ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఆర్థిక సహాయం కోసం అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూ.కే, యూ.ఎస్.కే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలలో పేరుగాంచిన విశ్వవిద్యాలయాలలో చదువుటకు టీఓఎఫ్ఈఎల్/జీఆర్ఈ/జీఎమ్ఏటీ/ఐఈఎల్‌టీఎస్‌లో ఈనెల 29లోగా సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

మానవపాడు,అక్టోబరు 16 (ఆంధ్రజోతి) : మండలంలోని అమరవాయి, కలుకుంట్ల గ్రామాల్లో డాక్టర్ సింధు, డాక్టర్ యాకుబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి చిన్నారులకు టీకాలు వేశారు. పుట్టిన ప్రతీ చిన్నారికి నాలుగు నుంచి 12 వారాల వరకు వేయించే టీకాలను క్రమం తప్పకుండా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. సూపర్‌వైజర్ చంద్రన్న పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

గద్వాల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల సర్వతోముఖ అభ్యున్నతే లక్ష్యంగా అవిశ్రాంత పోరాటం సాగిస్తున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద కోరారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద మహాసభ పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే మహాసభలకు జిల్లాకు చెందిన ఐద్వా ప్రతినిధులు, మహిళలు తరలిరావాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు రత్నమ్మ, జయలక్ష్మి, దివ్య, దేవిక, సరోజ, వెంకటేశ్వరి, అక్షిత ఉన్నారు.

భయం మాటున చదువులు

» శిథిలావస్థలో తనగల పాఠశాల
» ప్రహరీ లేక మందుబాబులకు అడ్డగా మారిన ప్రాంగణం



శిథిలావస్థకు చేరిన తనగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

వడ్డేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు సరైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓవైపు సిబ్బంది కొరత, మరోవైపు వసతుల లేమి కారణంగా విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అదనపు గదుల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరణతో పాటు తరగతి గదులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం తదితర వాటిని ఏర్పాటు చేసి పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చుదిద్దుతున్నారు. కాగా, వడ్డేపల్లి, శాంతినగర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వడ్డేపల్లి మండలం తనగల గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నలభై ఏళ్ల క్రితం నిర్మించగా, శిథిలావస్థకు చేరుకుంది. ఈ పాఠశాలలో 512 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మరోవైపు పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు పైకప్పు నుంచి నీరు కురుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో తల్లిదండ్రులు పాఠశాల తరగతి గదులపై కప్పు నుంచి పెచ్చులు ఊడి పడటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడితో ప్రస్తావించారు. గతంలో పనిచేసిన హెచ్ఎం పాఠశాల దుస్థితిపై విద్యాశాఖ అధికారికి, కలెక్టర్‌కు వివరించినా ఇప్పటి వరకు స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు కవితను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఇటీవల తాను గెజిటెడ్ హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టానని, పాఠశాల పైకప్పు నుంచి పెచ్చులు ఊడుతున్న మాట వాస్తమేనని, దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం



తనగల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ప్రహరీ లేకపోవడంతో గ్రామస్థులు పాఠశాల సమీపంలోనే బహిర్భూమికి వెళ్లడంతో దుర్వాసన వెదజల్లిన మాట వాస్తవమే. మన ఊరు - మన బడి కింద పాఠశాల ఎంపికైనా నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్ ముందుకు రాలేదు.

- రజిత రాజు, మాజీ ఎంపీపీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

వడ్డేపల్లి/మల్దకల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యావ్యవస్థపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కురవ పల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతినగర్ పట్టణంలోని పీకే కాంప్లెక్స్‌లో బుధవారం బీఆర్ఎస్వీ నాయకుడు గడ్డం భరత్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో నిధులు అందకపోవడంతో విద్యార్థులు పై తరగతులకు వెళ్లలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు డిగ్రీ, పీజీ, వృత్తి విద్య కోర్సులకు సంబంధించి కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో వారు కళాశాలలకు తాళాలు వేశారని, రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేసి విద్యావ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సోమశేఖర్ నాయుడు, మాధవ్, రాజగోపాల్ పాల్గొన్నారు. అదే విధంగా మల్దకల్‌లో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్ల నుంచి రూ.ఆరు వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు తిరుమల్, శివ, సాయికుమార్, శ్రావణ్, శంకర్, శివ, భీమేష్, షాహీద్, చరణ్, భీమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా

దేవుళ్లపై దాడులు చేస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గద్వాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : హిందూ ఆలయాలు, దేవుళ్లపై అల్లరి మూకలు దాడులు చేస్తే సహించేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం ఘటనపై స్పందించిన ఆయన బుధవారం డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పనితీరుతోనే తెలంగాణలో హిందువుల ఆలయాలు దేవుళ్లపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి మత విద్వేశ కార్యకలాపాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. నగరంలో హిందూ పండుగలకు పెరుగుతున్న ఆదరణ, హిందువుల ఐక్యతను చూడలేకనే దుర్మార్గులు ఇంత దుస్సాహసానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఈ దాడి వెనక ఉన్నవారు ఎవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని, లేదంటే హిందువుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి శ్రీనివాసులు, నాయకులు బల్గెర శివారెడ్డి, దేవదాసు, డబ్బిలేటి నర్సింహ, గాంజాసాయి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

ఇటిక్యాల/ఎర్రవల్లి/వడ్డేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి పశువులకు కాపాడేందుకు గాను గాలికుంటు నివారణ టీకాలను వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. ఈనెల 16 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు నెలరోజుల పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలను వేయనున్నట్లు తెలిపారు. మండలంలో 5,567 ఆవులు, ఎద్దులు, 5,462 గేదెలు, 53,439 గొర్రెలు, 6,183 మేకలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లోని గొర్రెల, పశువుల యజమానులు ఈ టీకాల పంపిణీ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎర్రవల్లి మండలం పుటాన్‌దొడ్డి, శేకుపల్లి, ధర్మవరం గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి భువనేశ్వరి తెలిపారు. ఈ టీకాల పర్యవేక్షణ జిల్లా పశు సంవర్థక శాఖాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. బుధవారం 145 పశువులకు, 110 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు.

వడ్డేపల్లి మండలం కొంకల ప్రాథమిక పశువైద్యశాల వద్ద 69 రైతులకు చెందిన ఆవులు, ఎద్దులు 233, గేదెలు 602 మొత్తం 835 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. గురువారం కూడా పశువులకు టీకాలు వేస్తామన్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి వరప్రసాద్, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు లతీఫ్, బుచ్చమ్మ, ఓఎస్ వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర నారాయణగౌడ్ ఉన్నారు.



కొంకల గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

ఉల్లాసంగా కళా ఉత్సవ్ పోటీలు




చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గద్వాల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలభవన్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన వాయిద్య సంగీతం, గాత్రం, హార్మోనియం, వయోలిన్‌తో పాటు చిత్ర లేఖనం పోటీల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 9, 10, 11, 12 తరగతులు విద్యార్థులు 45 మందికిపైగా హాజరయ్యారు. పోటీలకు ప్రారంభించిన జిల్లా విద్యాశాఖ ఏఎంవో ఎస్తేరురాణి, విద్యార్థుల్లో దాగి ఉన్న కళానైపుణ్యం, సృజనాత్మక భావాలను వెలికితీయడమే పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ విజేతలుగా నిలిచిన వారు త్వరలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీనియర్ కళాకారులు, ఉపాధ్యాయులు సామవేదం వేణుగోపాల చారి, వీఎస్ కృపయ్య, జయప్రకాష్, గౌరీశంకర్, మూలంపల్లి శుభ, సుజాత, గణేష్, నాట్య శిక్షకులు సత్యం, బాలభవన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శంకర్ వ్యవహించారు.

ప్రజా చైతన్యంతోనే పురోగతికి బాట

గద్వాల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు చైతన్యవంతులైతేనే సమాజం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని ఉమ్మడి జిల్లా రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్ అన్నారు. ఆ దిశగా అన్నివర్గాల ప్రజలు, ముఖ్యంగా యువతీయువకులను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా 'బాపు బాటలో సత్యశోధన' అనే నినాదంతో ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర తలపెట్టినట్టు తెలిపారు. అలంపూర్ జోగుళాంబ ఆలయం వద్ద ప్రారంభమైన సత్యశోధన పాదయాత్ర జిల్లాకు చేరిన సందర్భంగా బుధవారం పట్టణంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అపారమైన సహజ వనరులు రోడ్డు, రైలు, రవాణా సౌకర్యం మెండుగా ఉన్నప్పటికీ మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడినదిగా మిగిలిపోవడం బాధాకరమన్నారు. ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వాలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై, పాలకులపై ఒత్తిడి తేవడమే తాము చేపట్టిన పాదయాత్ర ఉద్దేశం అన్నారు. అలంపూర్ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర 100 రోజుల పాటు సాగి 1000 కిలోమీటర్ల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వర క్షేత్రం వరకు సాగుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు మనకు అనుసరనీయమన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ, సరస్వతీ దేవి చిత్రపటాలకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చంద్రమోహన్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్

ప్రతిభ కనబరిచిన పోలీసులకు సేవా పతకాలు : ఎస్పీ

గద్వాల క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : 2024 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఉత్కృష్ట, అతి-ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపిక చేయడం జరిగిందని, అందులో భాగంగానే గద్వాల జిల్లా నుంచి వివిధ హోదాలో ఉన్న అధికారులు సేవా పతకాలకు ఎంపికైనట్లు ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. అతి-ఉత్కృష్ట సేవా పతకానికి ఏ.అరుణ (సీసీఎస్ ఎస్ఐ), ఎం.శైలజ (సీసీఎస్ ఎస్ఐ), జి.సుంకన్‌బాబు (హెడ్‌కానిస్టేబుల్, శాంతినగర్), షేక్ నిజాముద్దీన్ (హెడ్‌కానిస్టేబుల్, గద్వాల) ఎంపికయ్యారు. ఉత్కృష్ట సేవా పతకాలకు జి.రవిబాబు (సీఐ, అలంపూర్), టి.వెంకట్‌రెడ్డి (ఏఆర్‌హెచ్‌సీ, సాయుధ దళ పోలీస్ కార్యాలయం), వై.జమ్మన్న (ఏఆర్‌ఎచ్‌సీ, సాయుధ దళ పోలీస్ కార్యాలయం), ఏ.రేఖరెడ్డి, (మానవపాడు పీసీ), ఖలీల్ (ఏ.ఆర్‌పీసీ, సాయుధ దళ కార్యాలయం), జె.చెన్నకేశవులు, (పీసీ, శాంతినగర్), టి.శ్రీనివాసులు (హెచ్‌జీ, సాయుధ దళ పోలీస్ కార్యాలయం) ఉండగా, వీరికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

ప్రపంచ ఆకలి దినం జరుపుకోవాలి



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న కూలీలు

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆహార దినం కాదని, ప్రపంచ ఆకలి దినాన్ని జరుపుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ.. ఈనెల ఒకటి నుంచి 16 వరకు ప్రతీ గ్రామంలో పర్యటించి కూలీల సాధక బాధలు తెలుసుకొని ప్రపంచ ఆహార దినాన్ని కాకుండా ప్రపంచ ఆకలి దినాన్ని జరుపుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న కూలీలలో పురుషులకు రూ.300, మహిళలకు రూ.200 ఇవ్వడం జరుగుతుందని, పెరిగిన ధరలతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. కాబట్టి ప్రస్తుతం ప్రపంచ ఆరోగ్య దినాన్ని కాకుండా ఆకలిదినాన్ని పాటించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అలంపూర్ తాలుకా కోఆర్డినేటర్ హరిజన వెంకటేష్, వ్యవసాయ కూలీలు కురువ భీమేష్, పూజిత, సరస్వతి, జయమ్మ, శంకరమ్మ, నరసమ్మ, కవితమ్మ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

అలంపూర్ చౌరస్తా/మానవపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారికి, వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురు పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. అలంపూర్ చౌరస్తాలో వాహనాలు నిలపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే విధంగా ఇటిక్యాలపాడు గ్రామంలో డీపీఆర్వో ఆధ్వర్యంలో కళాజాత బృందం వారు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మద్యం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని మానవపాడు ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రం నుంచి జాతీయ రాహదారి వాహనాలను తనిఖీ చేశారు.

అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు కోసం వినతి

గద్వాల క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉన్న కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని రెండవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు చేయాలని కోరుతూ గద్వాల బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు పోర్టు ఫోలియో న్యాయమూర్తి పుల్లా కార్తిక్‌ను కోరారు. బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం పోర్ట్ఫోలియో జడ్జిను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అలాగే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, హోంశాఖ జీపీ. మహేష్ ఝురకీలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బార్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యుడు కొండారెడ్డి, సీనియర్ న్యాయవాదులు వినోదాచారి, విజయ్‌మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆనంద్‌రావు, నర్సింహులు, మహేష్, సురేష్ ఉన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు బుట్టల పంపిణీ

గట్టు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన గట్టు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఎల్‌టీఐ మైండ్ ట్రీ, భవిష్యభారత్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి గ్రస్తులకు బుట్టల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలో 15 మంది రోగులను గుర్తించి ఫుడ్ బాస్కెట్‌లు అందజేశామని డబ్ల్యూహెచ్‌వో కన్సల్‌టెంట్ డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము ఇస్తున్న ఈ ఫుడ్ బాస్కెట్‌లను టీబీ ఉన్న పేషెంట్‌లు మాత్రమే తినాలని కోరారు. టీబీ అనేది నిర్ధారణ అయిన తర్వాత ఆహారం తీసుకోవాలని అనిపించదని, కానీ ఆ సమయంలో ఇచ్చిన మందులను సక్రమంగా వాడుకోవాలని కోరారు. భవిష్యభారత్ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ డా.బాలరాజు, రాజారాం, సాధిక్, సోమశేఖర్, టీబీ నోడల్ పర్సన్ వెంకటాద్రినాయుడు, భవిష్య భారత్ సిబ్బంది వెంకటేశ్వరులు, మునిస్వామి, అలీం, వినోద్, ప్రతాప్ పాల్గొన్నారు.

పాగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేలం పాట

కేటీదొడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురంలో ఉన్న పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం దేవాదాయశాఖ అధికారి వెంకటేశ్వరి, ఆలయ కార్యనిర్వహణాధికారి పురేందర్ కుమార్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో కొబ్బరి కాయలు అమ్ముకునేందుకు వెంకటాపురం సంజీవులు రూ.8,30,000 దక్కించుకున్నాడు. లడ్డు అమ్ముకొనుటకు బోయలగూడెం సురేష్ రూ.1,10,000, ఆలయ ప్రాంగణంలో మిఠాయి దుకాణము నిర్వహించుకొనుటకు శరణప్ప రూ.2,50,000లకు దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఆలయ సిబ్బంది రవిప్రకాష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల తొలగింపు కారణంగా గురువారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ-4 ఫీడర్ పరిధిలోకి వచ్చే ఓల్డ్ హౌసింగ్ బోర్డుకాలనీ, రాధాకృష్ణ కాలనీ, బీరెల్లి రోడ్డు, రెండో రైల్వే గేటు, వేణుకాలనీ, హీరో షోరూమ్, ప్రభుత్వ ఆసుపత్రి, ఎమ్మార్వో కార్యాలయం, రైల్వే స్టేషన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ధర్మశాల, పాటియేటీవ్ కేర్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని పాలియేటీవ్ కేర్‌లో ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి సంధ్యాకిరణ్మయి రోగులకు పండ్లు పంపిణీ చేసి, మాట్లాడారు. ఈ పాలియేటీవ్ కేర్ రోగులకు ఉపశమన సంరక్షణ కేంద్రం అని, ఇక్కడ 24 గంటల పాటు సౌకర్యాలు ఉం టాయన్నారు. అంతేగాక హోమ్ కేర్ వాహనంలో గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్న వ్యాధిగ్రస్థులకు చికిత్స అందించడం, ఆసుపత్రికి తీసుకురావడం జరుగుతుందన్నారు. జిల్లా ఎన్సీడీ కోఆర్డినేటర్ శ్యాంసుందర్ ఉన్నారు.

గద్వాల సీఐగా టంగుటూరి శ్రీనివాస్

గద్వాల క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా టంగుటూరి శ్రీనివాస్ నియమితులైనట్లు బుధవారం ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గతంలో ఇక్కడ సీఐగా ఉన్న భీంకుమార్ వికారాబాద్ జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలు నాగేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. ప్రస్తుతం నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా టంగుటూరి శ్రీనివాస్ రాగా, ఈయన ప్రస్తుతం ఐజీపీ, ఎంజీ- రెండవ. జోన్‌లో వెయిటింగ్‌లో ఇక్కడికి బదిలీపై వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

అయిజ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అతి పేద విద్యార్థినికి అయిజ అఖిల పక్ష కమిటీ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన మేస్త్రీ దేవదాసు, బుజ్జమ్మ కూతురు సుస్మిత ఈ మధ్యనే వచ్చిన మెడిసిన్ ఫలితాల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో సీటు రాగా, అఖిలపక్ష కమిటీ, రెడ్ క్రాస్ సొసైటీ కలిసి రూ.50,000 ఆర్థిక తోడ్పాటు అందించారు. అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు అంజనేయులు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ కన్వీనర్, అఖిల పక్ష కమిటీ సభ్యులు తాహర్, ఆంజనేయులు, హన్మంతు, తిమ్మారెడ్డి, షరీఫ్, వెంకట్రాములు, మహ్మద్‌బాష పాల్గొన్నారు.

హోర్డింగ్ తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ చౌరస్తా సమీపంలో కూలుతున్న ప్రచార హోర్డింగును జోగుళాంబ ఆలయ అధికారులు తొలగించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో ప్రచురితమైన కూలుతోంది సారూ.. అనే కథనానికి ఆలయ ఈవో పురేందర్ కుమార్ స్పందించి, సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో హోర్డింగులను తొలగించారు.



జాతీయ రహదారిపై తొలగించిన హోర్డింగు